# గణేష్ నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు

**శెనార్తి మీడియా, గోదావరిఖని/ మంచిర్యాల:**

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో గణేష్ నిమజ్జనోత్సవం ప్రశాంతంగా సాగేందుకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ తెలిపారు. పెద్దపల్లి ట్యాంక్‌బండ్, నిమజ్జన మార్గాలను పరిశీలించిన ఆయన సీసీ కెమెరాల పర్యవేక్షణ, ట్రాఫిక్ డైవర్షన్లు, రోడ్ల మరమ్మత్తులు, క్రేన్లు, గజఈతగాళ్లు, త్రాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉత్సవ కమిటీలు పోలీసుల సూచనలకు అనుగుణంగా నడుచుకుని వేడుకలు సమయానికి ముగించాలని, చిన్నారులు, మహిళల భద్రతపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఊరేగింపులో డీజేలు, బాణాసంచా నిషేధమని హెచ్చరిస్తూ, మత సామరస్యంతో నిమజ్జనం జరగాలని విజ్ఞప్తి చేశారు. పెద్దపల్లి డీసీపీ కరుణాకర్, పెద్దపల్లి ఏసీపీ జీ కృష్ణ, పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్, పెద్దపల్లి ఎస్ఐ లక్ష్మణ్, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



**గణేష్ మండపాలను సందర్శించిన సీపీ అంబర్ కిషోర్ ఝూ**

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ పెద్దపల్లి పట్టణంలో గణేష్ మండపాలను డీసీపీ కరుణాకర్, ఏసీపీ జి. కృష్ణ, సీఐ ప్రవీణ్‌కుమార్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ అనిల్‌కుమార్, ఎస్సైలు తదితరులతో కలిసి సందర్శించారు. ప్రభుత్వం కళాశాల మైదానంలో వినాయక విగ్రహాలను దర్శించి పూజలు చేశారు. అనంతరం మండప నిర్వాహకులతో మాట్లాడి నిమజ్జనం ఏర్పాట్లను తెలుసుకున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచిస్తూ, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిర్వాహకులు సీపీని ఘనంగా సన్మానించారు.

**మహిళల సమస్యల పరిష్కారమే లక్ష్యం : సీపీ**

**శెనార్తి మీడియా, పెద్దపల్లి:** మహిళల సమస్యల పరిష్కారమే మహిళా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసిన ముఖ్య ఉద్దేశమని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ పెద్దపెల్లి డీసీపీ కరుణాకర్‌తో కలిసి పెద్దపెల్లి జోన్ మహిళా పోలీస్ స్టేషన్‌ను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడారు. కొత్తగా ఏర్పాటైన స్టేషన్ పని తీరును, మహిళలకు ఎలాంటి సాయం అందించగలమో తెలుసుకోవడానికే ఠాణాను సందర్శించినట్లు వివరించారు. మహిళలు తమ సమస్యలను నేరుగా చెప్పుకునే వేదికగా ఈ స్టేషన్ పనిచేస్తుందని చెప్పారు. చట్ట పరంగా రక్షణ, భద్రత కల్పించడమే కాకుండా సమస్యల పరిష్కారంలో మహిళా అధికారుల సహకారం అందుబాటులో ఉంటుందని తెలిపారు. పెద్దపెల్లి జోన్ పరిధిలో కుటుంబ సమస్యలు ఎదుర్కొనే మహిళలు ఈ స్టేషన్‌ను సంప్రదించవచ్చని సీపీ సూచించారు. డీసీపీ కరు ణాకర్, ఏసీపీ జి.కృష్ణ, ఇన్‌స్పెక్టర్ పురు షో త్తం, ఎస్ఐలు రవళి, రాజమణి పాల్గొన్నారు.







## గణనాథులను దర్శించుకున్న రవికాంత్ యాదవ్

**శెనార్తి మీడియా, తలమడుగు :**

మండల కేంద్రంలోని అంబేద్కర్ యువజన సంఘం, బ్లూ బీమ్ యువజన సంఘం, శ్రీకృష్ణ యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథులను బీఆర్ఎస్ పార్టీ నాయకులు, బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు మేకల రవికాంత్ యాదవ్ దర్శించుకున్నారు... నిర్వాహకులు ఆయన శాలువా లతో సత్కరించారు వారి వెంట యువజన సంఘాల సభ్యులు తదితరులు ఉన్నారు..



## గణపతి లడ్డు దక్కించుకున్న గొంటిముక్కుల వంశీ

**శెనార్తి మీడియా, తలమడుగు :** మండల కేంద్రంలో బ్లూ బీమ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాథుని లడ్డు వేలం పాటలో బుధవారం యువజన సంఘ సభ్యుడు గొంటి ముక్కుల వంశీ రూ. 8001 గణపతి లడ్డు దక్కించుకున్నారు... గణపతి నిర్వా హకులు వంశీని శాలువాతో సత్కరించారు.. ఇంటి వరకు బ్యాండ్ మేళాలతో లడ్డును తీసుకెళ్లారు.

## ఘనంగా లక్ష్మీ గణపతి హోమం



**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

టీఎన్జీవో హౌసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో శ్రీ సిద్ధి వినాయక పర్యావరణ హిత మండపంలో బుధవారం లక్ష్మీ గణపతి హోమం ఘనంగా జరిగింది. జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, ఉత్సవ కమిటీ నిర్వాహక అధ్యక్షుడు గుండేటి యోగేశ్వర్ దంపతుల ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో హోమం నిర్వహించారు. సాయి మృదుల్ ఆచార్య పర్యవేక్షణలో జరిగిన ఈ హోమంలో కమిటీ నాయకులు పొన్న మల్లయ్య, వెన్నం లక్ష్మీ నారాయణ, పొలంపల్లి వెంకటేశ్వర్, కొండ్ర బాలయ్య, సత్యనారాయణ, బెక్కం ఊషన్న, నక్క రాజన్న కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. అనంతరం కమిటీ నాయకులు భూముల రామ్మోహన్, సైండ్ల మొండయ్య, శ్రీపతి బాబురావుతో పాటు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.సొసైటీ కార్యదర్శి హబీబ్ హుస్సేన్ దంపతులు అన్నదానం ఏర్పాటు చేశారు.





## బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం

**శెనార్తి మీడియా, హైదరాబాద్:**

బహుజన్ సమాజ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన ఇబ్రం శేఖర్‌ను మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ సన్మానించారు. హైదరాబాద్ లక్డికాపూల్‌లోని రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ, ఆంధ్ర బీఎస్పీ సంయుక్త సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఇబ్రం శేఖర్‌కు పుష్పగుచ్ఛం అందించి, శాలువా కప్పి ము ల్కల్ల రాజేంద్రప్రసాద్ సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కాదాసి రవీందర్, నిర్మల్ జిల్లా అధ్యక్షుడు అడ్వకేట్ జగన్మోహన్, అదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు రత్నాపురం రమేష్, రాష్ట్ర ఈసీ సభ్యుడు జంగు బాబు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ కౌన్సిలర్ చేయిచేసుకున్న సీఐ



**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణంలో యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు, మహిళలకు మద్దతు తెలిపిన బీఆర్ఎస్ మాజీ కౌన్సిలర్ అనిల్‌పై పట్టణ సీఐ దేవేందర్‌రావు దుర్భాషలాడుతూ చేయి చేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి.ఈ ఘటనపై పెద్ద ఎత్తున బీఆర్ఎస్ శ్రేణులు పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించి తీవ్ర ఆందోళన చేపట్టారు. సీఐకి వ్యతిరేకంగా "రక్షకులా భక్షకులా పోలీసులా?", "కాంగ్రెస్ కార్యకర్తలా?", "మంత్రి వివేక్ వెంకటస్వామి డౌన్ డౌన్" అంటూ నినాదాలు చేశారు.సీఐ దేవేందర్‌రావు తప్పు ఒప్పుకుని భేషరతుగా కౌన్సిలర్ అనిల్‌కి క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ శ్రేణులు డిమాండ్ చేశారు.



## మోడ్రన్ ధోబీఘాట్లకు నిధులు కేటాయించాలి



- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ళ ఆశయ్య
- రజక వృత్తిదారుల సంఘం సమావేశం

**శెనార్తి మీడియా, హైదరాబాద్ :**

ప్రభుత్వం ఉపాధి కల్పన, వృత్తుల ఆధునీకరణ కోసం నిధులు కేటాయించాలని, ప్రతి జిల్లాకు రూ.10 కోట్లతోటి మోడ్రన్ ధోబిఘాట్లు నిర్మిస్తామని రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య తెలిపారు. రాజకీయ హామీలను నెరవేర్చి, వృత్తిదారులకు రూ.10 లక్షల తోటి ఆర్థిక సహకార పథకం, పెన్షన్, రక్షణ చట్టం, ఫెడరేషన్ పాలకవర్గ హామీలు వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల 42 శాతం వెంటనే అమలు చేయాలని, ఏ,బీ,సీ,డీ వర్గీకరణ కూడా చేయాలని పేర్కొన్నారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బీసీ బిల్లులో వర్గీకరణ లేకపోవడం అన్యాయం అని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం ఇచ్చిన హామీలు అమలు చేయాలని, ఉప వర్గీకరణతో బిల్లు అమలు చేయాలని కచ్చితంగా డిమాండ్ చేశారు. ఈనెల 8వ తేదీన విద్యుత్ ఉద్యమం అమరుడు సత్తెనపల్లి రామకృష్ణ 25వ వర్ధంతి, వీర వనిత చాకలి ఐలమ్మ 40వ వర్ధంతిని సెప్టెంబర్ 10న రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరుపుతామని, ఐలమ్మ స్ఫూర్తితో హామీల కోసం ఉద్యమాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సి. మల్లేష్, పాయిరాల రాములు, రాష్ట్ర సహాయ కార్యదర్శి వడ్డెబోయిన వెంకటేష్, మరియాల గోపాల్, రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిగొండ రాంబాబు, అంబే చక్రపాణి, పెద్దాపురం భాస్కర్, వడ్డేమాన్ బాలరాజ్, పి. సంజీవ్, కాశయ్య, వీరబాబు తదితరులు పాల్గొన్నారు

## మున్సిపల్ ఇంజనీర్ బాధ్యతలు స్వీకరించిన రాజేందర్



**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

మంచిర్యాల మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఇంజనీర్ పోస్టు ఖాళీగా ఉండటంతో అక్కడ అసిస్టెంట్ ఇంజనీర్‌గా పని చేస్తున్న ఎస్. రాజేందర్‌ను తాత్కాలిక ఇన్‌చార్జ్ మున్సిపల్ ఇంజనీర్‌గా నియమించారు. హైదరాబాద్ పి.హెచ్. ఇంజనీర్ ఇన్‌చీఫ్ ఉత్తర్వుల మేరకు సెప్టెంబర్ 2న రాజేందర్ బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ కె. సంపత్‌కుమార్ రాజేందర్‌ను అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ బి. రాజమనోహర్, మేనేజర్ ఎస్. కరుణాకర్, సి.హెచ్. అనితాదేవి, టి.ఓ. డి. మధు తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కేజీబీవీ సిబ్బంది నిర్లక్ష్యం

- వసతిగృహంలో శునకాల సంచారం



**శెనార్తి మీడియా, శంకరపట్నం :** కేశవపట్నం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సిబ్బంది నిర్లక్ష్యంతో బుధవారం వసతిగృహంలోకి కుక్క ప్రవేశించింది. విద్యార్థులు మధ్యాహ్న భోజనానికి వెళ్లిన సమయంలో వసతిగృహంలో ఉంచిన నీటి బకెట్‌లోని నీటిని కుక్క తాగి వెళ్లింది. ఈ దృశ్యం సోషల్ మీడయాలో చక్కర్లు కొడుతున్నది. వసతిగృహంలో ట్యాప్ విరిగిపోవడంతో గుడ్డతో తాత్కాలి క మరమ్మత్తులు చేయగా, దాంతో నీరు వృథాగా పోతున్నట్టు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. తాత్కాలిక పరిష్కారాలు కాకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.సిబ్బంది నిర్లక్ష్యంపై జిల్లా అధికారులు శాఖ పరమైన చర్యలు తీసుకుని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు.

